ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



విహారం.. విషాదం

- ట్రాక్టర్‌ను ఢీకొన్న స్కార్పియో
- నలుగురి దుర్మరణం
- ఆరుగురికి తీవ్రగాయాలు

7

బడుల్లో మెగా జాతర

- పాఠశాలల్లో మెగా పేరెంట్స్‌, టీచర్స్‌ మీటింగ్‌
- నంద్యాలలో పాల్గొన్న మంత్రి ఫరూక్‌
- కొలిమిగుండ్లలో హాజరైన మంత్రి బీసీ



విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి

నంద్యాల ఎడ్యుకేషన్‌, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన మెగా పేరెంట్స్‌, టీచర్స్‌ మీటింగ్‌ పండుగ వాతావరణాన్ని తలపించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో జాతర వాతావరణాన్ని తలపించాయి. కలెక్టర్‌ రాజకుమారి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు వారం రోజుల నుంచి శ్రమించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, బంధువులు, పూర్వ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొని ఆటల పోటీలు, మ్యూజికల్‌ చైర్స్‌, ముగ్గుల పోటీలతో పాటు విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. అత్యధిక మార్కులు సాధించి షైనింగ్‌ స్టార్స్‌ అవార్డుకు ఎంపికైన విద్యార్థులను సత్కరించారు. అలాగే విద్యార్థులు, వారి తల్లికి మొక్కలను అందజేసి పెంచే బాధ్యతను అప్పగించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులతో కలసి అందరూ సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. నంద్యాల ప్రభుత్వ బాలికల పాఠశాలలో రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడే విద్యార్థులతో కలసి మంత్రి భోజనం చేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన జాహేదా, ముస్కాన్‌లను మంత్రి సత్కరించారు. అదేవిధంగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి కొలిమిగుండ్ల మండలంలోని జడ్పీ హైస్కూల్‌లో పాల్గొన్నారు. పాఠశాల భవనాలు, తరగతి గదులను పరిశీలించారు. ఇదిలా ఉండగా నంద్యాల పాఠశాలలో పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు తమ సంతోషాన్ని సమావేశంలో వ్యక్తపరిచారు.

మా ఇంట్లో ముగ్గురికి ‘తల్లికి వందనం’



మాది పేద కుటుంబం. మా ముగ్గురు పిల్లలకు ‘తల్లికి వందనం’ ద్వారా రూ.36వేల డబ్బులు నా ఖాతాలో జమ అయ్యాయి. ఒక్కసారిగా అంత సహాయం అందుతుందని ఎప్పుడూ ఊహించలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రి నారాలోకేశ్‌కు రుణపడి ఉంటాం. పిల్లల ప్రభుత్వ పాఠశాలల్లో బాగా చదువుతున్నారు. అందరం సంతోషంగా ఉన్నాం.

● రేష్మా, నంద్యాల పట్టణం

చాలా సంతోషంగా ఉంది



నేను ప్రభుత్వ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. బడి తెరిచి రోజునే మాకు సన్నబియ్యంతో అన్నం పెడుతున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌ విద్యార్థి మిత్ర కిట్‌లను కూడా అందజేశారు. అమ్మానాన్నలతో కలిసి ఇలాంటి మీటింగ్‌ ఎప్పుడూ జరుగలేదు. పండుగలా జరుపుకుంటుంటే చాలా సంతోషంగా ఉంది.

● సునయన, 9వ తరగతి విద్యార్థిని

ఎంతో ఆత్మీయంగా ఉంది.



పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అతిథులతో కలిసి ఏర్పాటు చేసిన ఈ సమావేశం ఎంతో ఆత్మీయంగా ఉంది. ఇలాంటి సమావేశంలో సాధారణంగా ప్రైవేట్‌ పాఠశాలల్లో ఉండేవి. కాని ప్రభుత్వ పాఠశాలలో నిధులకు ఏ మాత్రం లెక్కచేయకుండా పండుగ వాతావరణంలా నిర్వహించడం గర్వకారణంగా ఉంది. ఇలాంటి సమావేశాలతో విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల మధ్య అన్యోన్యతాభావం ఏర్పడుతుంది. పిల్లల సమస్యలను, వారి అలవాట్లపై తల్లిదండ్రులతో చర్చించే అవకాశం ఉంటుంది.

● పద్మావతి, ఉపాధ్యాయురాలు, నంద్యాల

పంచాయతీని కాజేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్‌



- రుద్రవరం పంచాయతీలో రూ. 2.13 కోట్లు స్వాహా
- అక్రమాల్లో సర్పంచ్‌, కార్యదర్శుల పాత్ర
- ప్రస్తుతానికి ఒక కార్యదర్శిపై సస్పెన్షన్‌ వేటు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉన్నతాధికారుల్లో అలజడి

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా అవినీతే. ఉన్నతాధికారులు కూడా సదరు అక్రమార్కులతో ఏకమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మేజర్‌ పంచాయతీలో పెద్ద ఎత్తున జరిగిన అవినీతి అక్రమాలే నిదర్శనం. కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. రుద్రవరం పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై ‘ఆంధ్రజ్యోతి’లో ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఏకమై కాజేశారు, మార్చి 5న వేటుకు రంగం సిద్ధం, ఏప్రిల్‌4న అక్రమార్కులపై చర్యలకు సిద్ధం..? కథనాలను ప్రచురించింది. దీంతో కలెక్టర్‌ రాజకుమారి స్పందించి మూడు విడతలుగా విచారణ చేయించారు. ఈ క్రమంలో ఏప్రిల్‌ మొదటి వారంలో మూడో సమగ్ర నివేదికను విచారణ అధికారులు కలెక్టర్‌కు అందజేశారు.

నంద్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో రుద్రవరం మేజర్‌ పంచాయతీలో ఇష్టారాజ్యంగా అవినీతి అక్రమాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే...ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సదరు పంచాయతీలో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుతో అసలు గుట్టు బయటపడింది. ఇదే క్రమంలో ఆంధ్రజ్యోతి వరస కథనాలు ప్రచురించడంతో మరింత ఉత్కంఠ రేపినట్లైంది. కలెక్టర్‌ మూడు విడతలగా విచారణ చేయించి తదుపరి చర్యల నిమిత్తం సమగ్ర నివేదికను ఈ ఏడాది ఏప్రిల్‌ 23వ తేదిన ఆ శాఖ కమిషనర్‌కు పంపారు. తాజాగా ఆ శాఖ కమిషనర్‌ సదరు పంచాయతీలో రూ. 2.13 కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు భావించి కఠిన చర్యలు దిశగా ఈనెల 1వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ శాఖ ఉద్యోగులతో పాటు సదరు అక్రమార్కుల్లో అలజడి మొదలైంది.

కమిషనర్‌ ఉత్తర్వులు ఇలా...

రుద్రవరం మేజర్‌ పంచాయతీలో గత వైసీపీ పాలనలో 2021 జూన్‌ నుంచి ఈ ఏడాది మార్చి 25వ తేది వరకు జరిగిన పంచాయతీ పనుల్లో.. రూ. 2.13,83,297 కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధాంచారు. కమిషనర్‌కు అందిన నివేదిక ప్రకారం సదరు పంచాయతీలో పనిచేసిన సెక్రటరీ సుబ్బారావును మాత్రమే సస్పెండ్‌ చేయడం కలకలం రేపుతోంది. అంతటితో ఆగకుండా.. జిల్లా డీపీవోతో పాటు జిల్లా ఆడిట్‌ అధికారి కలిసి.. గత ఐదేళ్ల పాలనలో సదరు పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపరంగా.. అక్కడ పనిచేసిన సమయంలో సర్పంచ్‌తో కలిసి చేయడంలో వారి పాత్ర ఉన్న మేరకు.. సదరు ఉద్యోగి ఎవరూ.. సదరు ఉద్యోగిపై (సస్పెన్షన్‌) ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? వీటితో పాటు సర్పంచ్‌పై తీసుకున్న చర్యలు..? చెక్‌ పవర్‌ రద్దు..? అంతే కాకుండా ప్రతి ఏడాది సదరు పంచాయతీలో జరిగిన ఆడిట్‌ ఉద్యోగులు.. సదరు పంచాయతీ ఉన్నతాధికారులు (ఈవోఆర్డీ, స్పెషల్‌ ఆఫీసర్లు, డీఎల్‌పీవో, ఆడిట్‌ ఉద్యోగులు)పై క్రమశిక్షణ చర్యలు తీసుకుని నివేదిక పంపాలని ఆదేశం. అదే విధంగా బాధ్యతారహితంగా ఉన్న డీపీవోలను సైతం వివరణ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆ తర్వాత సదరు డీపీవోలపై ఎలాంటి చర్యలు ఉంటాయో తెలియని పరిస్థితి. ఇదిలా ఉండగా.. నిబంధనలు ప్రకారం.. ఎక్కడైనా ఏ పంచాయతీలోనైనా అవినీతి అక్రమాలు జరిగితే.. అక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శిలతో పాటు సర్పంచ్‌లను బాధ్యులను చేసి రికవరీ చేయాల్సి ఉంటుంది. అందువల్లే ఈ పంచాయతీలో జరిగిన రూ. 2.13 కోట్ల నిధుల రికవరీకి ఆదేశించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. జరిగిన అక్రమాలపరంగా.. 50శాతం సర్పంచ్‌.. మిగిలిన 50శాతం అక్కడ పనిచేసిన కార్యదర్శులు రికవరీ రూపంలో చెల్లించాల్సిందేనని ఆ శాఖ ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలో సదరు సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శుల్లో భయాందోళన మొదలైంది.

రెండు వారాల్లో నివేదిక

కమిషనర్‌ ఉత్తర్వులు ప్రకారం.. డీపీవో.. జిల్లా ఆడిట్‌ అధికారితో కలిసి కలెక్టర్‌ సమగ్ర నివేదికను రెండు వారాల్లో(ఈనెల 15వ తేదీలోపు) ఆ శాఖ కమిషనర్‌కు పంపాల్సి ఉంది. ఈ క్రమంలో సర్పంచ్‌తో పాటు కొందరు కార్యదర్శులు సైతం గుట్టుచప్పుడు కాకుండా సదరు పంచాయతీలో ఫేక్‌ బిల్లులను సృష్టించి రికవరీ శాతం తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. కమిషనర్‌ ఉత్తర్వులు వచ్చి 10 రోజులు కావచ్చినా సదరు సర్పంచ్‌ చెక్‌ పవర్‌ రద్దు చేయలేదని తెలిసింది. ఈ అక్రమాల్లో సర్పంచ్‌తో కలిసి రూ. 2.13 కోట్లు నిధుల దుర్వినియోగంలో పాలు పంచుకున్న కార్యదర్శులపై చర్యలు తీసుకుని పూర్తిస్థాయి రికవరీ చేస్తారా..? లేదా..? అనే అనుమానాలు కూడా ఉన్నాయి.

కమిషనర్‌ ఉత్తర్వులను పక్కాగా పాటిస్తాం..



కమిషనర్‌ ఉత్తర్వులను పక్కాగా అమలు చేస్తాం. ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదు. అక్రమాల్లో రికవరీకి కచ్చితంగా ఆదేశిస్తాం. గడువలోపు తగిన నివేదికను కమిషనర్‌కు పంపుతాం.

● కలెక్టర్‌ రాజకుమారి



వేటుకు రంగం సిద్ధం..!

గతంలో ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం (ఫైల్‌)

కొనలేం.. తినలేం..!

- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- భగ్గుమంటున్న పచ్చి మిర్చి.. కేజీ రూ.80
- బీన్స్‌ కేజీ రూ.160 ● చిక్కుడు రూ.120
- లబోదిబోమంటున్న వినియోగదారులు

చాగలమర్రి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యులు ఏమీ కొనలేని.. తినలేని పరిస్థితులు. గత వారం వరకు ప్రజలకు అందుబాటులో ఉన్న పచ్చిమిర్చి ధర ఒక్కసారిగా భగ్గుమంటోంది. చాగలమర్రి సంతమార్కెట్‌లో పచ్చిమిర్చి కిలో రూ.80 పలికింది. వారం క్రితం కేజీ రూ.30 పలికింది. దీంతో పచ్చిమిర్చి ధరలు చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రైతులు పండించిన సమయంలో కిలో రూ.20 ఉందని, ఇప్పుడు కాయలు ఎక్కడ లేక పోవడంతో ధర పెరిగిందని రైతులు అంటున్నారు. సీజనల్‌లో మాత్రం ధర తక్కువగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పచ్చిమిర్చితో పాటు క్యారెట్‌ కేజీ రూ.80, బెండ రూ.40, చిక్కుడు కేజీ రూ.120, బీన్స్‌ రూ.160, టమోటా కేజీ రూ.50, అల్లం రూ.80 తదితర రకాల కూరగాయల ధరలు పెరగడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కూరగాయల ధరలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.



ప్రజలు లేక వెలవెలబోతున్న మార్కెట్‌

శాకంబరిగా భ్రామరి



6లో

అప్రమత్తంగా ఉండాలి

● వీసీలో సీఎస్‌ విజయానంద్‌

నంద్యాల ఎడ్యుకేషన్‌ / నంద్యాల టౌన్‌, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీజనల్‌ వ్యాధులపై వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్‌) విజయానంద్‌ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. కలెక్టర్‌ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్‌లతో పాటు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర-2047, పీ4 ఫౌండేషన్‌, రిలయన్స్‌ కంప్రెస్ట్‌ బయోగ్యాస్‌ యూనిట్లు, సీజనల్‌ వ్యాధుల నియంత్రణ చర్యలు తదితర అంశాలపై సచివాలయం నుంచి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్‌ రాజకుమారి సీఎస్‌కు వివరించారు. పీ4 సర్వే జరుగుతోందని, సీజనల్‌ వ్యాధులపై జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని కలెక్టర్‌ వివరించారు. సమావేశంలో డీఆర్‌వో రామునాయక్‌, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో సమావేశం ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడుతున్న సీఎస్‌

పోక్సో కేసులో నిందితుడికి కారాగారం

7



ఈ ఏడాది లేనట్టే..!



తుంగభద్ర డ్యాం సైట్‌కు కాంట్రాక్ట్‌ సంస్థ గత నెల 20న తీసుకొచ్చిన గేట్ల విడిభాగాలు (ఫైల్‌)

- తుంగభద్ర డ్యాంకు ముందే వచ్చిన వరద
- గతేడాది ఆగస్టులో వరదకు కొట్టుకుపోయిన 19వ గేటు
- జూన్‌లో కొత్త గేటు ఏర్పాటుకు సన్నాహాలు
- ముందస్తు వరద రావడంతో ఆగిపోయిన పనులు
- మరో ఏడాది పాటు వేచి చూడాల్సిందే

గతేడాది ఆగస్టులో కొట్టుకుపోయిన తుంగ భద్ర డ్యాం 19వ నంబరు కొత్త గేటును ఈ ఏడాదైనా ఏర్పాటు చేస్తారా? అనే సందేహం కలుగుతోంది. టీబీపీ బోర్డు ఇంజనీర్లు స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు. జూన్‌ 20వ తేదీ నాటికే క్రస్ట్‌ లెవల్‌పైన వరద చేరడం, ఎగువన నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండడంతో.. ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్యనాయుడు సైతం ఈ పరిస్థితుల్లో గేటు ఏర్పాటు రిస్క్‌ తీసుకోవడం సరైంది కాదని సలహా ఇచ్చారు. దీంతో ఈ ప్రక్రియను వాయిదా వేశారు. ఇప్పటికే డ్యాం గేట్ల పరిస్థితిని అధ్యయనం చేసిన కేఎస్‌ఎన్‌డీటీ సర్వీసెస్‌ సంస్థ అన్ని గేట్లు 45 శాతానికిపైగా తప్పుపట్టాయని, తక్షణమే మార్చాలని నివేదిక ఇచ్చారు. కనీసం కొట్టుకుపోయిన ఆ ఒక్క గేటునైనా ఏడాదిగా ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కర్నూలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాల సంయుక్త జలాశయం తుంగభద్ర 131.29 టీఎంసీల సామర్థ్యంతో 1953లో నిర్మించారు. 212 టీఎంసీలు వినియోగించుకునేలా డిజైన్‌ చేశారు. కృష్ణా వాటర్‌ డిస్ప్యూట్‌ ట్రిబ్యునల్‌ (కేడబ్ల్యూడీటీ) అవార్డు-1 కేటాయింపులు ప్రకారం కర్ణాటక 138.99 టీఎంసీలు, ఉమ్మడి ఏపీ, తెలంగాణకు 73.01 టీఎంసీలు వాడుకోవాలి. డ్యాంలో పూడిక చేరడంతో సామర్థ్యం 105.788 టీఎంసీలకు తగ్గించారు. మూడు రాష్ట్రాల్లో సుమారు 12.5లక్షల ఎకరాలకు సాగునీరు, కోటి మందికి పైగా దాహం తీర్చే జలజీవనాడి తుంగభద్ర జలాశయం. 72 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన 33 క్రస్ట్‌ గేట్లు 45 శాతానికి పైగా పటుత్వం కోల్పోయాయని నిపుణులు నిగ్గు తేల్చారు. గతేడాది ఆగస్టులో 19వ నంబరు గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అప్పుడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించి క్రస్ట్‌ గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లను తుంగభద్ర డ్యాంకు పంపించారు. కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ కన్నయ్య నాయుడు బృందం రేయింబవళ్లు కష్టపడి వరదలోనే స్టాప్‌లాగ్‌ ఎలిమెంట్స్‌ ఏర్పాటు చేసి దాదాపుగా 60 టీఎంసీలు కడలిపాలు కాకుండా కాపాడారు.

జూన్‌ ఆఖరిలోగా కొత్త గేటు ఏర్పాటు లక్ష్యం

కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), నేషనల్‌ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్‌ ఏకే బజాజ్‌ నేతృత్వంలోని నిపుణుల కమిటీ డ్యాం, గేట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గేట్లు సామర్థ్యం నిర్ధారణ, రేడియోగ్రఫీ, ఎంపీటీ, అల్ట్రా సోనిక్‌, డీపీటీలో అనుభవం, నైపుణ్యం కలిగిన కేఎస్‌ఎన్‌డీటీ సర్వీసెస్‌ సంస్థ 32 గేట్ల జీవిత కాలం, స్ట్రెంత్‌ను క్షుణ్ణంగా పరిశీలించి మొత్తం గేట్లు 40-50 శాతానికి పైగా స్ట్రెంత్‌ (బలం) కోల్పోయాయని, అన్ని గేట్లు మార్చాల్సిందేనని నివేదిక ఇచ్చింది. నేషనల్‌ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్‌ అనిల్‌ జైన్‌, ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్యనాయుడు డ్యాంను తనిఖీ చేశారు. నిపుణుల సూచన మేరకు 19వ నంబరు గేటు ఈ ఏడాది జూన్‌ ఆఖరిలోగా ఏర్పాటు చేసేలా రూ.1.98 కోట్లకు టెండర్లు పిలిచారు.

మిగతా 6వ పేజీలో



మృత్తిక సంగ్రహణ మహోత్సవం

● బంగారు పల్లకిలో మృత్తిక ఊరేగింపు



తులసి వనంలో మృతికకు పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో మృత్తిక(మట్టి) సంగ్రహణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏడాదికి ఒక్కసారి జరిగే మృత్తిక సంగ్రహణ మహోత్సవంలో భాగంగా తుంగభద్ర నదీ తీరంలో ఉన్న తులసి వనంలో ప్రత్యేక పూజలు చేసి మట్టిని సేకరించాక బంగారుపల్లకిలో ఉంచి ఊరేగింపుగా శ్రీమఠానికి తీసుకవచ్చారు. రాఘవేంద్రుడి మూల బృందావనం ఎదుట ఉంచి పూజలు చేశారు. ఇలా సేకరించిన మట్టిని వివిధ ప్రాంతాల్లో ఉన్న శ్రీమఠం బృందావనాలలో ఉంచి ప్రతిష్ఠాపన చేస్తారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మాట్లాడుతూ మృత్తిక శక్తి స్వరూపమని, అందులో రాఘవేంద్రస్వామి ఉంటా రని అన్నారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మంచాల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ పాల్గొన్నారు.

తెలుపు రంగులో పరిమళ ప్రసాదం

నెలరోజుల పాటు టెంకాయ కొట్టడం నిషేధం



తెలుపు రంగులో తయారు చేసిన పరిమళ ప్రసాదం

మంత్రాలయం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తులకు విక్రయించే పరిమళ ప్రసాదం రంగును తెలుపులోకి మార్చారు. గత రెండు రోజుల నుంచి చాతుర్మాస వ్రతాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీరులు ఆదేశాలతో పరిమళ ప్రసాదం కాషాయ రంగు నుంచి తెలుపులోకి మార్చారు. ఈ నెల రోజులపాటు టెంకాయ కొట్టడం నిషేధమని మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచారి తెలిపారు.

20న రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

నంద్యాల హాస్పిటల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న నంద్యాలలోని నెరవాటి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నంద్యాల జిల్లా చెస్ సంఘం రాష్ట్రస్థాయి చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామకృష్ణ డిగ్రీ కాలేజీలో గురువారం జరిగిన సమావేశంలో వారు మా ట్లాడుతూ 6, 8, 10, 12, 14, 16 సంవత్సరాల్లోపు విభాగాల్లో ఓపెన్, బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచినవారితో జాతీయ స్థాయి చెస్ స్కూల్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్‌లో క్రీడాకారులుగా నమోదు చేసుకున్నవారు ఈ నెల 16వ తేదీలోపు డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.ఏపీచెస్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా చెస్ సంఘం చైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు డా.రవికృష్ణ, టోర్నమెంట్ చైర్మన్ హేమంత్ రెడ్డి, రాష్ట్ర చెస్ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజారమేష్ చక్రవర్తి పాల్గొన్నారు వివరాలకు 9010451585నెంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

రగ్బీలో కర్నూలు బాలుర జట్టుకు రజతం



రగ్బీ విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు స్పోర్ట్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గత నెల 28, 29 తేదీల్లో నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్ పాఠశాల మైదానంలో జరిగిన అండర్-18 బాలుర రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు బాలుర జట్టు రజత పతకం సాధించింది. ఈ పోటీల్లో ఆదర్శ విద్యామందిర్ పాఠశాల విద్యార్థి ఎం.భరత్ పాల్గొని జట్టు విజయానికి తమ వంతు కృషి చేశాడు. భరత్ నాలుగు సార్లు రగ్బీలో జాతీయ స్థాయిలో, 8సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా ఆదర్శ విద్యాసంస్థల అధినేత బి.తిమ్మయ్య, డైరెక్టర్ డా.బి.హరికిషన్, ప్రిన్సిపల్ బి.రామమాధవి, అధ్యాపక బృందం మహబూబ్ సుభాని, గురువారం భరత్‌ను అభినందించారు.

జనమే జనం

● ఏటేటా పెరుగుతున్న జనాభా
● జిల్లాలో 40.5లక్షలపైగా జనాభా
● నేడు ప్రపంచ జనాభా దినోత్సవం





ఆత్మకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఒక దేశ ఆర్థిక ప్రణాళికలు, సామాజిక పథకాలు రూపొందించడానికి జనాభా లెక్కలు అవసరం. జనాభా లెక్కల ఆధారంగానే ప్రభుత్వ పథకాల రూపకల్పన, వెనుకబడిన ప్రాంతాల, వర్గాల అభివృద్ధి జరుగుతాయి. అందువల్ల ప్రపంచ వ్యాప్తంగా జనాభా గణాంకాల సేకరణ ప్రాముఖ్యత సంతరించుకుంది. 1987 జూలై 11వ తేదీన జన్మించిన శిశువుతో ప్రపంచ జనాభా 500కోట్ల (5 బిలియన్ల)కు చేరుకుంది. అందువల్ల ఆనాటి నుంచి ఐక్యరాజ్యసమితి జూలై 11ని ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటిస్తున్నది. ప్రపంచ దేశాల్లో 40శాతం జనాభా మూడవ ప్రపంచ దేశాలైన భారత్, చైనాలోనే ఉంది. ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన నివేదికల ప్రకారం ఈదశాబ్దానికి ప్రపంచ జనాభా 800 కోట్లకు పైగా చేరుకునే అవకాశం ఉంది.

చిన్నకుటుంబం చింతలేని కుటుంబంగా వర్ధిల్లుతుంది. దంపతులకు ఇద్దరు సంతానం ఉంటే ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవించవచ్చు. ఇద్దరు పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దవచ్చు. సంతాన సంఖ్య పెరిగితే జీవన ప్రమాణాలు తగ్గుతాయి. పెద్ద కుటుంబాల్లో ఎక్కువశాతం కష్టాలు తాండవం చేస్తుంటాయి. పిల్లలకు చదువు, పౌష్టికాహారం, వారి బాగోగులను సక్రమంగా చూసేందుకు అగచాట్లు తప్పడం లేదు. తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగితే జనాభా నియంత్రణ సాధ్యమవుతుంది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను చేయించుకుని అధిక సంతానాన్ని అరికట్టవచ్చు. జిల్లాలో 40.5 లక్షలపైగా జనాభా ఉన్నది. అయితే ఇటీవల కాలంలో స్త్రీ, పురుషుల నిష్పత్తి సమానంగా లేకపోవడం, వృద్ధుల సంఖ్య పెరుగుతుండటంతో పిల్లల్ని కనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునివ్వడం గమనార్హం.

2025 ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆర్థిక అనిశ్చితి, వాతావరణ మార్పు, జనాభా పరివర్తనల మధ్య యువత తమ భవిష్యత్తును రూపొందించుకునేలా ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. ఉపాధి, సమగ్ర కుటుంబ నియంత్రణ సేవలకు ప్రభుత్వాలు, సమాజం సహకారం అందించాలి.

వచ్చే 16 ఏళ్లలో దేశంలో పెరగనున్న వృద్ధుల జనాభా



రానున్న 20ఏళ్లలో దేశంలో వృద్ధుల జనాభా గణనీయంగా పెరగనున్నట్లు సర్వేలు వెల్లడి స్తున్నాయి. ఇందులో ఆశ్చర్యంలో కలిగించే విషయం ఏమిటంటే 19ఏళ్ల వయస్సులోపు జనాభా పడిపోనుంది. 2011లో 19ఏళ్ల లోపు వారు 41శాతం వుండగా 2041 నాటికి 25శాతానికి తగ్గిపోనుంది. దీనికి కారణం గర్భాధారణ సామర్థ్యం రేటు (టీఎఫ్ఆర్) తగ్గిపోవడం, మరో పక్క 60ఏళ్ల పైబడిన వారి జనాభా 2011లో 8.6శాతం ఉండగా 2041లో 16శాతానికి పెరగనుందని అంచనా. ప్రత్యేకించి తెలుగురాష్ట్రాల్లో రిప్లేస్‌మెంట్ స్థాయి కంటే టీఆర్ఎఫ్ తక్కువగా వుంది. తద్వారా వయసుమీరే వారి సంఖ్య పెరగనుంది. 2041నాటికి దేశంలో 60ఏళ్లు దాటిన వారి సంఖ్య 24కోట్లకుపైగా పెరగనుంది. 2011లో వీరి సంఖ్య 10.42కోట్ల జనాభా మాత్రమే ఉండేది.

కలుపు తీసేందుకు కాడెద్దులై..

ఎద్దుల గెలానికి రూ.2వేలు చెల్లించలేకే..



క్యాబేజీ పంటలో రైతులే కాడెద్దులై సేద్యం చేస్తున్న రైతులు

తుగ్గలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పంటలో కలుపును తీసేందుకు రైతులు కాడెద్దులయ్యారు. గురువారం తుగ్గలికి చెందిన రైతులు ఎద్దుల గెలానికి రూ.2వేలు వెచ్చించలేక కాడెద్దులై సేద్యం చేస్తున్నారు. దంతి పట్టుకుని క్యాబేజీ, మిరప, కంది పంటల్లో కలుపు మొక్కలు తొలగిస్తున్నారు. పంటలు సాగు చేయడానికి పెట్టుబడులు పెరగడంతో సేద్యం చేసేందుకు అంత మొత్తం చెల్లించలేక అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎకరా పొలానికి రూ.2వేలు చెల్లించలేక

ఎకరా పొలంలో క్యాబేజీ, మిరప పంట సాగు చేశా. అందులో ఎద్దులతో గుంతక చేసేందుకు గెలానికి రూ.2వేలు. ఒక్కో కూలీకి రూ.300లు మొత్తం రూ.2,600లు చెల్లించలేక ఇద్దరు కూలీలతో కలిసి తానే కాడెద్దుగా మారి కలుపు మొక్కలను ఏరివేశాం.

● ఆకుల చంద్ర, రైతు, తుగ్గలి

భావి భారత పౌరులను తీర్చిదిద్దాలి

తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



భోజనం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

వెలుగోడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణ, విద్య అందించి భావిభారత పౌరులుగా ఉపాధ్యాయులు తీర్చి దిద్దాలని నంద్యాల కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం వెలుగోడు పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా త్వరలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలిక్‌ఖాన్, సర్పంచ్ జయపాల్, విద్యా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా భ్రామరి

శ్రీశైలంలో ఘనంగా ఆషాఢ పౌర్ణమి



శాకంబరి అలంకరణలో అమ్మవారు, కూరగాయలతో అలంకరణ చేసిన శివలింగం

నంద్యాల టౌన్ (శ్రీశైలం), జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైలం భ్రమరాంబ అమ్మవారు గురువారం శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవంలో అమ్మవారికి కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాలు పూలు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఇందుకోసం అమ్మవారికి 3వేల కిలోల కూరగాయాలు, 100 గుమ్మడి కాయలు, 2వేలు నిమ్మకాయలు, 600 ఆకు కూర కట్టలను వినియోగించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. సకాలంలో పంటలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

ఘనంగా శాకంబరి ఉత్సవం

● కామేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



శాకంబరి పూజల్లో పాల్గొన్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకొని కామేశ్వరీదేవి అమ్మవారికి శాకంబరి ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. పండితుల వేదమంత్రాలతో విశేష అభిషేకాన్ని జరిపారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో సహస్రనామార్చన, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని శాకంబరి అలంకారంలో ఉన్న కామేశ్వరీదేవి అమ్మవారిని దర్శించు కున్నారు.ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివా సరెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఏఈవో యర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన 'శ్రీ షిరిడీ సాయిలీలలు' పద్య నాటకం



షిరిడీ సాయిలీలలు నాటకంలో ఓ దృశ్యం

కర్నూలు కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి వారి సౌజన్యంతో, ఏపీ నాటక అకాడమీ సహకారంతో గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రదర్శించిన 'శ్రీ షిరిడీ సాయిలీలలు' పద్య నాటకం ఆసాంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గురువారం గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ నాటక ప్రదర్శన ప్రారంభోత్స వానికి ముఖ్య అతిథిగా విద్యాసంస్థల అధినేత, విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటక రంగాన్ని పరిరక్షించుకొని కళాకారులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు గుర్రపుశాల అంకయ్య సాయిబాబా పాత్రలో నటించారు. మార్తాటి గోపాలరావు రాసిన ఈ నాటకానికి టీవీ రెడ్డి దర్శకత్వం వహించారు.

పటిష్టమైన విద్యా వ్యవస్థకు కృషి

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్ధనరెడ్డి

కొలిమిగుండ్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకొచ్చి విద్యా వ్యవస్థను మరింత పటిష్టంగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి పేర్కొన్నారు. గురువారం కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన మెగా పీటీఎం కార్యక్రమంలో మంత్రి బీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, సమాజంలోని ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడమే మెగా పీటీఎం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.28కోట్ల మంది ఈకార్యక్రమంలో పాల్గొనేలా మంత్రి నారా లోకేష్ కార్యక్రమాన్ని తలపెట్టారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం అమలు చేసి చరిత్ర సృష్టించామన్నారు. తొలిసారిగా సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనంతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నామ న్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడుతో దోచుకోవడం తప్ప పాఠశాలలకు చేసిందేమీలేదని విమర్శించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో పని చేస్తుంటే కొందరు కింది స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని అసంతృప్తి వ్యక్తంచేశారు. మంత్రి వస్తున్నారని తెలిసినా హెచ్ఎం, ఉపాధ్యాయులు కనీసం పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలియజేయాలన్న ఆలోచన లేకపోవడం బాధాకరమన్నారు. పాఠశాలలో తన సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుచేస్తానని మంత్రి బీసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, వివేక్, హుస్సేన్‌రెడ్డి, ప్రసాదు, కామిని క్రిష్ణరంగారెడ్డి, ఓబయ్య, భూపాల్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది లేనట్టే..!

(5వ పేజీ తరువాయి)

అహ్మదాబాద్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ సంస్థ టెండర్లు దక్కించుకుంది. తాత్కాలిక స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ తొలగించి కొత్త గేటు ఏర్పాటుకు టీబీపీ బోర్డు ఇంజనీర్లతో ఒప్పందం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం గదగ్‌లోని వర్క్‌షాప్‌లో గేటు తయారు (ఫ్యాబ్రికేషన్) చేసి విడిభాగాలను జూన్ 20న డ్యాం సైట్‌కు చేర్చారు.

పోటెత్తిన వరద.. గేటు ఏర్పాటు వాయిదా

తుంగభద్ర డ్యాం స్పిల్‌వే క్రస్ట్ లెవల్ 1,613 అడుగులు. ఆ లెవల్‌లో నీటి నిల్వ 43 టీఎంసీలుగా ఉంటుంది. క్రస్ట్‌లెవల్ కంటే దిగువన నీటి నిల్వ ఉన్నప్పుడే గేటును ఏర్పాటు చేయాలి. గతేడాది అమర్చిన తాత్కాలిక స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్‌ను తొలగించి కొత్త గేట్ ఎరెక్షన్ (అమర్చడం) చేయాలంటే 10-15 రోజులు పడుతుంది. జూన్ 20న డ్యాం సైట్‌కు గేటు విడిభాగాలు చేర్చారు. అదే రోజు డ్యాంకు 52 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరద తగ్గకపోవడం, క్రస్ట్‌లెవల్ దాటి వరద చేరడం గేటు ఏర్పాటుకు అడ్డంకిగా మారింది. గత నెల 25న ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్యానాయుడు ఈ సమయంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్ తొలగించి, కొత్త గేటు ఎరెక్షన్ చేయడం కష్టంతో కూడుకున్నది.. రిస్క్ తీసుకోవద్దు.. స్టాప్‌లాగ్ గేటు పటిష్టంగా ఉందని సలహా ఇవ్వడంతో గేటు ఏర్పాటును బోర్డు ఇంజనీర్లు వాయిదా వేశారు. గత 15 ఏళ్లుగా డ్యాంలో చేరే వరద రికార్డులు పరిశీలిస్తే.. ఈ సమయంలో సగటున 23.591 టీఎంసీలకు మించి వరద చేరలేదు. ప్రస్తుతం ముందస్తు వర్షాలు వల్ల మే 14న డ్యాంకు వరద మొదలై నెలాఖరుకు 15 టీఎంసీలు చేరాయి. జూన్ 20న డ్యాంలో 50,686 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంటే.. 22కు క్రస్ట్‌లెవల్ 1,613.28 అడుగుల లెవల్ దాటి 44.460 టీఎంసీలు చేరడమే కాకుండా 25,450 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో 19వ గేట్ ఏర్పాటు మరో ఏడాది వాయిదా పడింది. జనవరిలో టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి, ఏప్రిల్ ఆఖరిలోగా గేట్ ఎరెక్షన్ చేసే అవకాశం ఉన్నా నిర్ణయాలు తీసుకోవడంలో టీబీపీ బోర్డు ఇంజనీర్లు నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమనే ఆరోపణలు లేకపోలేదు. ఏప్రిల్ 30న క్రస్ట్ లెవల్ కంటే 28.74 అడుగులకు దిగువన 1,584.26 అడుగులో నీటి నిల్వ ఉంది.



ముందస్తు వరద రావడంతో గేటు ఏర్పాటు వాయిదా

గతేడాది కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు జూన్ ఆఖరిలోగా ఏర్పాటు చేయాలని కాంట్రాక్ట్ చేసుకున్న అహ్మదాబాద్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. గదగ్‌లోని వర్క్‌షాపులో గేట్లు ఫ్యాబ్రికేషన్ (తయారు) చేశారు. గత నెల 20న డ్యాంసైట్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో 51 వేల క్యూసెక్కులు వరద కొనసాగుతుంది. క్రస్ట్ లెవల్ 1613 అడుగులపైన వరద చేయడం, ఇన్‌ఫ్లో భారీగా ఉండడంతో ఈ సమయంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ తొలగించి, కొత్తగేట్ ఏర్పాటు చేయడం రిస్క్‌తో కూడుకున్నది. రిస్క్ వద్దని ఏపీ జలవనరుల శాఖ సలహాదారుడు కన్నయ్యానాయుడు కూడా సలహా ఇవ్వడంతో వాయిదా వేశాం. 15 ఏళ్ల వరద రికార్డులు పరిశీలిస్తే మే, జూన్‌లో ఈ స్థాయిలో వరద లేదు.

● నారాయణ నాయక్, ఎస్ఈ, తుంగభద్ర బోర్డు, హొస్పేట్

లక్ష్యంతో చదవాలి

ఈగల్ ఐజీ రవికృష్ణ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఈగల్ ఐజీ రవికృష్ణ

దేవనకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఈగల్ ఐజీ రవికృష్ణ పిలుపునిచ్చారు. కప్పట్రాళ్ల గ్రామంలో తానా భవనంలో గురువారం రవికృష్ణ రైతులు, పొదుపు సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. రైతులకు సేట్రీస్ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో మెగా పీటీఎం 2.0 లో రవికృష్ణతో పాటు, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పాల్గొన్నారు. వారికి విద్యార్థులు పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి ముందుకు వెళ్లాలన్నారు. కప్పట్రాళ్ల విద్యార్థులు విద్యలో రాణించి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా దేశ సేవ చేసినప్పుడే గుర్తింపు సాధ్యమన్నారు. వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ వంశీనాథ్, పాఠశాల హెచ్ఎం ప్రశాంతి, విశ్రాంత హెచ్ఎం రామరాజు, ఏవోలు ఉషారాణి, అక్బర్, మాజీ సర్పంచు దివాకర్‌నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే నాణ్యమైన విద్య

దేవనకొండ జడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ చైర్‌పర్సన్ పూల నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన తల్లికి వందనంతో విద్యాశాతం పెరగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నజీర్ అహ్మద్, ఎస్ఎంసీ వలి, టీడీపీ నాయకులు రంగన్న, ఉచ్చీరప్ప, మలకన్న, వీరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



దేవనకొండ జడ్పీ పాఠశాలలో పాల్గొన్న ఎంపీ నాగరాజు, ఆర్టీసీ చైర్‌పర్సన్ పూల నాగరాజు

ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

- దగ్ధమైన దుకాణాన్ని పరిశీలించిన డీఎస్పీ హేమలత

ఆదోని రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హేమలత హెచ్చరించారు. ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామంలో బుధవారం నిప్పు పెట్టిన ఈడిగ శంకర్ దుకాణాన్ని డీఎస్పీ గురువారం రూరల్ సీఐ నల్లప్ప, పెద్దతుంబళం ఎస్.ఐ మహేష్ కుమార్‌తో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా గ్రామంలోని కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, అల్లర్లకు పాల్పడేవారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. దుకాణానికి నిప్పు పెట్టిన కేసులో నిందితులు శ్రీరాములు, దాసప్ప, గర్జప్ప, జయరాం, నాగరాజు, మునిస్వామి, దుబ్బన్న, రవిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్.ఐ తెలిపారు.



దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో అబ్బాస్‌నగర్‌లో రహీంఖాన్ (39) అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. బళ్లారి చౌరస్తా సమీపంలో ఓ మెకానిక్ షాపులో పనిచేస్తున్నాడు. ఏడు నెలల క్రితం అప్పుచేసి యాపిల్ ఫోన్ కొన్నాడు. ఆ అప్పు తీర్చలేక తరుచూ మదనపడేవాడు. ఈనెల 4వ తేదీన శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషగుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్య, బంధువులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య హసీనా ఖాతూన్, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

కోడుమూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపాన బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. వివరాలు.. క్రిష్ణగిరి మండలం జి.మల్లాపురం గ్రామానికి చెందిన హేమంత్, శంకర్ బైక్‌పై పురుగుమందు కొనుగోలుకు కోడుమూరుకు వెళ్లారు. కృష్ణాపురం గ్రామం దాటాక గుండ్లకొండ వాగు వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హేమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హేమంత్ మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి కారాగారం

- రూ.50వేల జరిమానా

కర్నూలు లీగల్/చాగలమర్రి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పరిధిలోని ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి 20 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి ఈ.రాజేంద్రబాబు గురువారం తీర్పు చెప్పారు. 2021 జనవరి 26న బాలిక తన తండ్రి, నిందితుడితోపాటు గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లింది. మార్గమధ్యంలో ఎండ ఎక్కువైందని చెప్పి నిందితుడు బాలికను అక్కడే చెట్టుకింద ఆడిస్తానని చెప్పి ఆగిపోయాడు. బాలిక తండ్రి, మరొక వ్యక్తి వారిని అక్కడే ఉంచి పొలంలోకి వెళ్లారు. ఆ సమయంలో నిందితుడు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలికకు రక్తస్రావమైంది. 2021 జనవరి 28న చాగలమర్రి పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి ఆస్పత్రికి తరలించారు. అప్పటి ఆళ్లగడ్డ డీఎస్పీ రాజేంద్ర కేసును విచారించి మెడికల్ రిపోర్టులను, చార్జ్‌షీటును కోర్టులో దాఖలు చేశారు. కోర్టులో నిందితునిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.50వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. రూ.2లక్షలను నష్టపరిహారంగా ప్రభుత్వం బాధితురాలికి చెల్లించాలని న్యాయాధికారి తన తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున సీవీ శ్రీనివాసులు వాదించారు.

పట్టపగలు చోరీ

ప్యాపిలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. ఈ ఘటనలో బంగారు నగలు, నగదు అపహరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన రామాంజినేయులు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లారు. దీనిని గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి అందులోని 5తులాల బంగారు నగలు, రూ.30 వేల నగలు అపహరించుకొని పోయారు. పొలం పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చిన రామాంజినేయులు కుటుంబ సభ్యులు చోరీ జరిగిందని తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

పోటాపోటీగా..



రూ.4కోట్లతో సీసీ రోడ్డు నిర్మించనున్న ప్రాంతం

- రూ.4కోట్ల సీసీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు
- పాల్గొన్న నలుగురు కాంట్రాక్టర్లు

నంద్యాల హాస్పిటల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ గేటునుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు వేయనున్న సీసీరోడ్డు నిర్మాణానికి గురువారం టెండర్ల ప్రక్రియ పోటాపోటీగా సాగింది. రూ.4కోట్లతో నిర్మించనున్న ఈ రహదారి పనులను చేజిక్కించుకునేందుకు నలుగురు కాంట్రాక్టర్లు పోటీపడినట్లు తెలుస్తోంది. నెల్లూరుకు చెందిన వీటీఆర్ బ్రదర్స్ ప్రాజెక్ట్ కంపెనీ, కర్నూలుకు చెందిన డీఎంఎస్ఎన్ కన్‌స్ట్రక్షన్స్, పి.వెంకటకృష్ణారెడ్డి, ఆళ్లగడ్డకు చెందిన పీవీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలు పోటీపడినట్లు సమాచారం. ఈ టెండర్లు ప్రస్తుతం టెక్నికల్ టీమ్ బ్రిడ్లను పరిశీలించిన అనంతరం సీఈకి రెఫర్ చేయనున్నట్లు తెలిసింది. మంత్రి బంధువు టెండర్ దక్కించునేందుకు పావులు కదుపుతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయింది. కొన్నేళ్లుగా ఈ రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు రోడ్డుపై నిల్వ ఉంటూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఇందులో భాగంగానే రూ.4కోట్లు సీసీరోడ్డు నిర్మానికి మంజూరు చేశారు.

నాలుగు రోజుల్లో టెండర్లు ఓపెన్



నంద్యాల పట్టణంలో రూ.4కోట్లతో నిర్మించనున్న సీసీ రహదారికి సంబంధించిన టెండర్లను సీఈ ఆధ్వర్యంలో మరో నాలుగు రోజుల్లో ఓపెన్ చేయనున్నాం. సీక్రెట్ పద్ధతి ద్వారా టెండర్లు స్వీకరించాం. టెక్నికల్ కమిటీ బ్రిడ్లను ఎవాల్యుయేషన్ చేసిన అనంతరం సీఈకి ప్రతిపాదిస్తాం. సీఈ ఆధ్వర్యంలో బహిరంగంగా టెండర్లు ఓపెన్ చేస్తాం.

- శ్రీధర్‌రెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, నంద్యాల

విహారం.. విషాదం

- ట్రాక్టర్‌ను ఢీకొన్న స్కార్పియో
- నలుగురి దుర్మరణం
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- ప్రమాదంలో మూడు నెలల చిన్నారి మృతి
- క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలింపు

అప్పటివరకు ఆ కుటుంబం ఆనందంతో గడిపింది.. ఎంతో ఉత్సాహంగా భాగ్యనగరానికి విహారయాత్రకు వెళ్లారు. అంతా సవ్యంగా ముగిసింది. ఇక తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. స్కార్పియో వాహనంలో స్వగ్రామమైన కడప జిల్లా మైదుకూరుకు బయలుదేరారు. దాదాపుగా సగానికి పైగా ప్రయాణం ముగిసింది. ఇక కొన్ని గంటల్లో గమ్యస్థానాలకు చేరుతారు అనుకున్నారు.. ఇంతలోనే విధి వక్రీకరించింది. ఉన్న ఫళంగా వారు ప్రయాణిస్తున్న వాహనం ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వేగంగా వెళ్లి ఢీకొట్టింది. వాహనం నుజ్జునుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న వారు చెల్లాచెదురుగా పడిపోయారు. అందులో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు చికిత్స పొందుతూ అనంత లోకాలకు చేరారు. ఇందులో మూడు నెలల చిన్నారి కూడా మృత్యువాత పడటం ప్రతి ఒక్కరిని కంట తడిపెట్టించింది.

ఓర్వకల్లు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విహారయాత్ర ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు సంబరంగా విహారయాత్రకు వెళ్లి సరదాగా ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా మృత్యువు వెంటాడింది. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.



విహారయాత్రలో కుటుంబ సభ్యులు (ఫైల్)



మూడు నెలల చిన్నారి నదియా (ఫైల్)

కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై సోమయాజులపల్లె-కాల్వబుగ్గ గ్రామాల మధ్యలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఓర్వకల్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలు.. కడప జిల్లా మైదుకూరుకు చెందిన పది మంది కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు విహారయాత్ర వెళ్లారు. యాత్ర ముగించుకొని స్కార్పియో వాహనంలో బయలుదేరారు. కాల్వబుగ్గ సమీపంలో రాగానే నంద్యాల వైపు వెళ్తున్న బండల లోడు ట్రాక్టర్‌ను స్కార్పియో వాహనం వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ పఠాన్ మున్ని (35), షేక్ కమాల్ బాషా(50) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మైదుకూరు చెందిన మాబుచాన్(50) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గాయాలైన మూడు నెలల చిన్నారి షేక్ నదియా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రులు షేక్ ఖాదర్‌బీ, షేక్ షరీఫ్ శోకసంద్రంలో మునిగిపోయారు. తమ కళ్లముందే తమ కూతురు మృతిచెందడంతో రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ ప్రమాదంలో షేక్ షరీఫ్, స్కార్పియో డ్రైవర్ శ్రీహరికి తల వెనుక, నుదుటిపై గాయాలయ్యాయి. షేక్ మున్నాకు ఎడమ కన్ను, ముక్కుకు, షేక్ ఖాదర్‌కు ఎడమ చెవిపైన గాయాలయ్యాయి. షేక్ అబ్దుల్ ఖాదర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. షేక్ జానీకి ఎడమ వైపు, నుదుటిపైన గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టడంతో స్కార్పియో వాహనం నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన స్థలాన్ని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్ పరిశీలించారు. ఓర్వకల్లు పోలీసులు అక్కడికి చేరుకొని వెళ్లి వాహనాలకు అంతరాయం లేకుండా క్లియర్ చేసి క్షతగాత్రులను 108, టోల్ ప్లాజా అంబులెన్సులో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు తెలిపారు.



సంఘటనా స్థలంలో పోలీసులు

ఇష్టారాజ్యంగా..



- ఏళ్ల తరబడి ఉద్యోగుల హవా
- ఆర్‌యూలో విధులకు రాకుండానే జీతాలు
- అంతర్గత బదిలీలపై బ్లాక్‌మెయిల్.. బెదిరింపులు?
- దర్జాగా 'రియల్' దందాలు
- అవకతవకలు కట్టడి చేస్తాం: వీసీ

కర్నూలు అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్‌లో కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రొఫెసర్లు, విద్యార్థుల మధ్య పోరుకు ఆజ్యం పోస్తున్నారు. ఏళ్ల తరబడి విధులకు హాజరుకాకుండానే నెలనెలా వేతనాలు తీసుకుంటున్నారు. దర్జాగా కాలం వెళ్లదీస్తున్నారు. మరికొందరు విద్యార్థి నాయకులను అడ్డు పెట్టుకొని రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు.

హాల్ టికెట్లు ఇవ్వకపోవడంతో..

తాజాగా పీజీ, బీటెక్ పరీక్షలు ఈనెల 7నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్ష ప్రారంభమై రెండు రోజులు గడిచినా విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకపోవడంతో క్లర్క్‌ను సంప్రదించారు. హాల్‌టికెట్లు అవసరం లేదు.. వెళ్లండంటూ విద్యార్థులను చీదరించుకున్నాడు. పరీక్షా కేంద్రంలో ఓ హెచ్‌వోడీ విద్యార్థులకు హాల్ టికెట్లు లేకపోయినా బీటెక్ విద్యార్థులను పరీక్షలకు అనుమతించాడు. ఈ అంశాలు సర్వత్రా చర్చనీయాంశంగా ఉన్నాయి. ఉద్యోగులు విధులకు హాజరు కాకుండానే బరితెగించి మాట్లాడిన తీరుపై పలువురు విద్యార్థి నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నియంత్రణ, పర్యవేక్షణ చేపట్టాల్సిన హెచ్‌వోడిలకు సైతం వారి శాఖలపై పట్టులేక.. ఏసీ రూమ్‌ల్లో కాలక్షేపానికి మితమయ్యారనే విమర్శలున్నాయి. గాడిన పెట్టాల్సిన ఓ ఉన్నతాధికారిని చీటి కేసీ నీ బండారం బయట పెడతానని ఓ చిరుద్యోగి బ్లాక్ మెయిల్.. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ ప్రొఫెసర్ వద్ద వాపోయే పరిస్థితి వర్సిటీ క్యాంపస్ కొట్టుమిట్టాడుతోందని విద్యార్థులు వాపోతున్నారు.

రాజకీయ నాయకుల పేర్లతో..

రాజకీయ నాయకుల పేర్లను చెప్పుకొని కొందరు ఉద్యోగులు అధికారుల ఎదుట చెలరేగిపోతున్నారు. మరో ఉద్యోగి విద్యార్థి సంఘా లన్నీ నేను చెప్పినట్లే ముందుకు అడుగులేస్తాయని ఇలా కొందరు ఉద్యోగులు స్వంత అజెండా అమలు చేసుకుంటున్నారు. క్యాంపస్‌లో బోధనేతర ఉద్యోగులు 236 మంది ఉండగా అందులో 50మందికి పైగా విధులకు హాజరుకా కుండానే నెలానెలా జీతాలు తీసుకుం టున్నారని మరి కొందరు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. విధులకు హాజరయ్యే ఉద్యోగు లకు ఒక్కొక్కరి నుంచి నెలనెలా రూ.50 అసోసియేషన్ పేరుతో ఏళ్ల తరబడి కొందరు వ్యక్తులు కాజేస్తున్నారు. అలా జరగకుండా చూడాలని ఇటీవల కొందరు ఉద్యోగులు ఉపకులపతికి ఫిర్యాదు చేశారు.

అంతర్గత బదిలీలు చేస్తే చిట్టా విప్పుతా?

ఏళ్ల తరబడి ఫెవికాల్ వీరులుగా కొందరు ఉద్యోగులు కీలక స్థానాల్లో తిష్ట వేశారని కొందరు ఉద్యోగులు ఇటీవల ఉపకులపతికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఉపకులపతి అందుకు సంబంధించిన ఫైల్ సిద్ధంచేయాలని ఆదేశించినా సంబంధిత అధికారి సాహసించ లేకపోతున్నారు. ఓ కీలక ఉద్యోగి ఓ అధికారికి సంబంధించిన చిట్టా బయట పెడతానని హెచ్చరికలు జారీ చేశారనే చర్చ క్యాంపస్‌లో చక్కర్లు కొడుతోంది. రీసెర్చ్, ఎస్టాబ్లిస్ మెంట్, సీడీసీ, పరీక్షల విభాగం, ఇలా కొన్ని కీలక శాఖలో కొందరు ఉద్యోగులను ఏళ్ల తరబడి ఎలా కొనసాగిస్తారని అసోసియేషన్ నాయకులు మండిపడుతున్నారు. వారిని వెంటనే తొలగించాలని లేని పక్షంలో తాము విధులు బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు. దశాబ్దకాలంగా ఒకే సీటులో కొందరినే కొనసాగించడం వెనుక మాజీ ఉన్నతాధికారి తెరవెనుక ఉంటూ వారికి అండగా ఉండటం. వారి పెత్తనం క్యాంపస్‌లోని ఉన్నతాధికారులను శాసించే స్థాయికి చేరుకుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఫేస్ రీడింగ్ అమలుతో కట్టడి చేస్తాం

ఫేస్ రీడింగ్ ద్వారా ఉద్యోగుల విధుల హాజరు తీరులో అవకతవకలను కట్టడి చేస్తాం. ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడానికి సంబంధించి హెచ్‌వోడీలు పర్యవేక్షించాలి. ఆపై ఏదైనా ఉంటే చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్ల వ్యవహారంపై విచారించి చర్యలు తీసుకుంటాం. అంతర్గత బదిలీలు చేపడతాం. - వి. వెంకట బసవరావు, ఉపకులపతి, ఆర్‌యూ

అంగన్‌వాడీ సహాయకురాలిని తొలగించండి

- సీడీపీవోను ఆదేశించిన సబ్ కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, జూలై 10 ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధిగా ఉన్న మహిళకు ప్రభుత్వ ఉద్యోగం ఎలా ఇచ్చారని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సీడీపీవో ఉమా మహేశ్వరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రజాప్రతినిధికి అంగన్‌వాడీ పోస్టు' శీర్షికన ప్రచురితమైన కథనానికి సబ్ కలెక్టర్, జిల్లా అధికారులు స్పందించారు. మండలంలోని ఆరేకల్లుకు చెందిన వైసీపీ ఎంపీటీసీ శ్యామలమ్మ పదవికి రాజీనామా చేయకుండానే అంగన్‌వాడీ ఆయా ఉద్యోగం చేస్తుండడాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. ఈరమ్మ ఆలియాస్ శ్యామలమ్మను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సీడీపీవో తెలిపారు. సదరు మహిళపై చర్యలు తీసుకోవాలని ఐ-టీడీపీ నాయకులు సజ్జాద్ హుసేన్, విరుపాక్షి, మదిరె వీరేష్, అంజినమ్మ సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు



వినతిపత్రం ఇస్తున్న ఐ-టీడీపీ నాయకులు

బంధువులే భూమిని కాజేశారు

- రీ సర్వేలో అధికారుల మద్దతుతో దాయాదుల అక్రమాలు
- మంత్రి లోకేశ్‌కు మొరపెట్టుకున్న అక్కాచెల్లెళ్లు..

ఎమ్మిగనూరు/మంత్రాలయం, జూలై 10(ఆంధ్రజ్యోతి): బంధువులే తమ భూమిని కాజేశారని ఐదుగురు అక్కాచెల్లెళ్లు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు వీడియో ద్వారా ఫిర్యాదు చేశారు. మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఇరిగేషన్ ఏఈ ఉసేని కుటుంబం ఎమ్మిగనూరు పట్టణంలోని మునెప్ప నగర్‌లో నివాసం ఉంటున్నది. ఏఈ ఉసేనికి షహనాజ్ బాను, షహబాన బాను, షకీలా బాను, షర్మిలా బాను, సానియా బాను అనే ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఏఈ ఉసేని, అతని భార్య షేక్ నబీలకు సొంత గ్రామమైన మంత్రాలయం మండలం రచ్చు మర్రిలో 8.22 ఎకరాల (ఉసేనికి 519బీలో 3.66 ఎకరాలు, షేక్‌నబీకి 453ఏలో 4.66ఎకరాలు) భూమి ఉంది. ఈ భూ మిని కాజేయడానికి రీసర్వే సమయంలో ఉసేనికి ఎలాంటి సమా చారం ఇవ్వకుండా సొంత అన్న, అతని నలుగురు కుమారులు అధికారుల అండదండలతో రెండు సర్వేనంబర్ల లోని 3.66 ఎకరాల భూమి రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేయించు కున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏఈ ఉసేని, అతని కుమార్తెలు అప్పటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవటంతో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ న్యాయం జరగక పోవటంతో కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. పైగా ఉసేని అన్న, అతని కుమారులు ఇంటికి వెళ్లి ఫిర్యాదు చేయొద్దని బెదిరించారు. ఈ నేపథ్యంలో ఉసేని ఐదుగురు కుమార్తెలు వీడియో ద్వారా తమ గోడును మంత్రి నారా లోకేష్‌కు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పెద్దనాన్న, అతని కుమారులు తమ వారసత్వ భూమని కాజేశారని అన్నారు. మంత్రి నారా లోకేష్ ఈ సమస్యను పరిష్కరిస్తారన్న ఆశతో ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.



లోకేశ్‌కు పంపిన వీడియోలో ఆవేదనను తెలుపుతున్న అక్కాచెల్లెళ్లు

ఎస్ఈ, ఈఈలుగా అదనపు బాధ్యతలు

- ఎస్సార్బీసీ ఎస్ఈగా సుభకుమార్, టీజీపీ ఎస్ఈగా ప్రతాప్
- ఎఫ్ఆర్ఎల్ డివిజ్ ఈఈగా విజయరాజు
- హంద్రీనీవా డివిజన్-2 ఈఈగా పి. ప్రసాద్‌రావు
- పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

కర్నూలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పని చేసే ఈఈ, డీఈఈలకు ఎస్ఈ, ఈఈలుగా అదనపు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల ఎస్సార్బీసీ డివిజన్-3 ఈఈగా పని చేస్తున్న పి. సుభకుమార్‌కు నంద్యాల ఎస్ఆర్‌బీసీ సర్కిల్-1 ఎస్ఈగా, కేసీ కాలువ నంద్యాల డివిజన్ ఈఈగా పని చేస్తున్న సి.ప్రతాప్‌కు ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు నంద్యాల సర్కిల్ ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. అలాగే.. కర్నూలు క్వాలిటీ సెల్ (క్యూసీ) సబ్ డివిజన్ డీఈఈగా పని చేస్తున్న బి.విజయరాజును శ్రీశైలం డ్యాం నిర్వహణ సర్కిల్ పరిధిలోని కర్నూలు పీడబ్ల్యూ డివిజన్ (ఎఫ్ఆర్ఎల్ డివిజన్) ఈఈగా, అనంతపురం జిల్లా బత్తలపల్లి టీబీపీ హెచ్చెల్సీ డీసీ సబ్ డివిజన్ డీఈఈగా పని చేస్తున్న ఎన్. ప్రసాద్‌రావును కర్నూలు హంద్రీనీవా డివిజన్-2 ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఇస్తూ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- రెండు బైకులు, రూ.22,500 స్వాధీనం

బేతంచెర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దవరం గ్రామ సమీపంలో ఉన్న పెద్దమ్మ గుడి వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు.

ఈ దాడుల్లో ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు మోటారు సైకిళ్లను, రూ.22,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో 13 మంది పరారీలో ఉన్నారని తెలిపారు. సంజామల, ఆళ్లగడ్డ ప్రాంతాలకు చెందిన 15 మంది పెద్దమ్మ గుడి వద్ద పేకాట ఆడుతుండగా.. తన సిబ్బందితో దాడులు చేశామన్నారు. అరెస్టు చేసిన ముగ్గురుకి డోన్ కోర్టులో మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు.

హామీలు నెరవేరుస్తున్న ప్రభుత్వం

● ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్‌లో చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా ఇంటింటికి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇప్పటివరకు ప్రజలకు అందిన సంక్షేమ పథకాల లబ్ది గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రం సర్వనాశనమైందని ఈ పరిస్థితుల్లోనే రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు సీఎం చంద్రబాబు ఎంతగానోకృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, నాయకులు నాగూర్‌ఖాన్, శ్యామ్, సుబ్బరాజు, పెద్దన్న, నందయ్య, నరసింహులు, ప్రదీప్, మురహరి రవికుమార్, ఉమాదేవీ, శిరీష, సరోజ, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు: ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎమ్మెల్యే జయసూర్య, కార్యకర్తలు నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందజేసే సంక్షేమపథకాలను వివరిస్తూ సంబదితకర పత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, గ్రామ సర్పంచ్ రామచంద్రుడు, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పాణ్యం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం దేవదాయశాఖ డీఈఈ సీహెచ్ శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్యూలైన్, టికెట్ కౌంటర్, ఫ్లోరింగ్, లాకర్ గదులు, కోకనట్ షాప్, షెడ్లు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈ రవికిరణ్ కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, కాంట్రాక్టర్లు నవీన్, ప్రసాద్, యువశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

మహానంది: మహానంది క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవదాయశాఖ డీఈఈ సీహెచ్ శ్రీనివాసులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఇంజనీరింగ్ అధికారులు రవికుమార్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

'దేశం కోసం మధ్యవర్తిత్వం' అవగాహన సదస్సులు ప్రారంభం

నందికొట్కూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నందికొట్కూరు కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవా సంస్థ అధ్యక్షుడు శోభారాణి ఆధ్వర్యంలో 'దేశం కోసం మధ్యవర్తిత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయవాదులు, పారా లీగల్ వాలెంటీర్ల ఆధ్వర్యంలో కక్షిదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వం వల్ల కలిగే లాభాలను న్యాయవాది వెంకటరాముడు కక్షిదారులకు వివరించారు. ఈనెల 10 నుంచి 16వ వరకు అవగాహన సదస్సులు జరుగుతాయన్నారు. పారా లీగల్ వలంటీర్లు శోభారాణి, కేజియా, రెహమాన్, హుస్సేన్, కక్షిదారులు పాల్గొన్నారు.

కేసు నమోదు

జూపాడుబంగ్లా, జూలై 10(ఆంధ్రజ్యోతి): తాటిపాడు గ్రామంలో ఈనెల 7న ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొనడంతో సోఫిసాహెబ్‌కు తీవ్రగాయాలయ్యాయని ఎస్‌ఐ లక్ష్మీ నారాయణ తెలిపారు. తీవ్రగాయాలైన సోఫిసాహెబ్‌కు తీవ్ర గాయాలు కాగా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని, పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన మహబూబ్‌బాషాపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జనసేన బలోపేతానికి కృషి

నంద్యాల రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జనసేన బలోపేతానికి కృషి చేస్తామని నంద్యాలకు చెందిన భవనాసి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాత్రి విజయవాడలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ఆయన కార్యాలయంలో జనసేన పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అడుగు జాడల్లో ఉండి ఆయన చేసే అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామన్నారు. కులమతాలకు అతీతంగా ఉప ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

● పిల్లలను బడికి పంపాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే
● 'మెగా పీటీఎం'లో ప్రజాప్రతినిధులు, అధికారులు
● పాల్గొన్న ప్రముఖులు



పాణ్యం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత



బలపనూరులో మొక్కను అందజేస్తున్న జేసీ విష్ణుచరణ్



బండిఆత్మకూరులో బహుమతులు అదజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

పాణ్యం, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మండలంలోని మోడల్ పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోంచేశారు. పాఠశాల పరిధిలో మొక్కలు నాటారు. పాఠశాలకు రూ. 12 లక్షలతో త్వరలో ప్రహరీ పనులు ప్రారంభిస్తామన్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట సుబ్బారెడ్డి, ఎంఈవో కోటయ్య, సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ రంగరమేష్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, హెచ్‌ఎం దినేష్‌బాబు, సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి, పేరెంట్ కమిటీ చైర్మన్ రవినాయక్, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, నాయకులు రామ్మోహన్ నాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.

● విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల బాధ్యతే కీలకమని జేసీ విష్ణు చరణ్ అభిప్రాయపడ్డారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పాణ్యం మండలం బలపనూరు జడ్పీ హైస్కూల్ పీటీఎం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తల్లిదండ్రులకు ఆయన మొక్కలు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో పాటు భోంచేశారు. సర్పంచ్ మాధవీలత, తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీటీసీ వరలక్ష్మమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆదిశేషారెడ్డి, టీడీపీ నాయకులు శివశంకరరెడ్డి, ఆర్ఐ రాము, వీఆర్వో శంకర్, హెచ్‌ఎం నారాయణ పాల్గొన్నారు.

● మధ్యాహ్న భోజన బియ్యం నిల్వలపై టీడీపీ నాయకులు శివశంకరరెడ్డి, యార్డు ఉపాధ్యక్షుడు చేసిన ఆరోపణలపై జేసి బియ్యం నిల్వలను పరిశీలించారు. విద్యార్థులకు ఇచ్చిన బియ్యం మినహా అధికంగా 50 కిలోల బియ్యం అదనంగా ఉండడంతోపాటు వాటి లెక్కల్లో అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో జేసీ హెచ్‌ఎం నారాయణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యం నిల్వలపై నివేదిక ఇవ్వాలని తహసీల్దారును ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులను తాగునీటి మోటారుకు నిధులు ఇవ్వాలని హెచ్‌ఎం వేధిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు.

గడివేముల: కూటమి ప్రభుత్వంతోనే విద్యాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి అన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో వాసుదేవగుప్తా, రాజరాజేశ్వరి హైస్కూల్ కరస్పాండెంట్ రామేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: నంద్యాల ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. నంద్యాల బాలభవన్ విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బండిఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బంగారు భవిత ఒక టీడీపీకే సాధ్యమైందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం బండిఆత్మకూరు జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన విద్యా సామగ్రి, దుస్తులు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తల్లి దండ్రులు ఈ ప్రభుత్వాన్ని మరువకూడదన్నారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మిడుతూరు: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్‌లో మెగా పీటీఎం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరు అయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకోసం బడివైపు అడుగులు ముందుకు వేయాలని అన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథరామయ్య, ఎంఈవో ఫైజున్నీసా బేగం, మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుశేన్, హెచ్‌ఎం సాయి తిమ్మయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, సర్పంచ్ జయలక్ష్మమ్మ, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సుధాకర్, తువ్వా భగీరథరెడ్డి, సర్వోత్తమరెడ్డి పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహించారు. బొల్లవరం జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా కెసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి హాజరయ్యారు. మసీదుపురంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి హాజరయ్యారు. తిమ్మాపురం మోడల్ స్కూల్‌లో పోలీసులు శక్తి యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, ఎంఈవో రామసుబ్బయ్యల, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: పట్టణంలోని నూనెపల్లె పొట్టి శ్రీరాములు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు పేరుతో మొక్కలు నాటించారు. పలు క్రీడాపోటీలలో విజేతలైన విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో బ్రహ్మంనాయక్ పాల్గొన్నారు.

● విద్యారంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముస్లీం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ పేర్కొన్నారు. అయ్యలూరు గ్రామంలోని జపీహెచ్‌ఎస్ ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులోని మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ నాగరవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన పీటీఎం కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజ్, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల టీడీపీ కన్వీనర్ రవీంద్రరెడ్డి, సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, మధు, హుస్సేన్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. కేజీబీవీ, జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల విన్యాసాలు అలరించాయి.

కొత్తపల్లి: మండలంలోని పాఠశాలల్లో మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. గోకవరంలో హెచ్‌ఎం సుబ్బరాయుడు , ఉపాధ్యాయులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికలు హైస్కూల్, గాంధీ మెమోరియల్ హైస్కూల్‌లో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మండల తహసీల్దార్ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంఈవో సుభాన్, హెచ్‌ఎం సావిత్రి, రామిరెడ్డి, కౌన్సిలర్ లాలుప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్‌లు ఉమాదేవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● హాజీనగర్‌లోని ఉర్దూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో సభాన్ పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: వడ్డెమాను జడ్పీ హైస్కూలులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీటీఎం 2.0 కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకుడు మాండ్ర లింగారెడ్డి, హెచ్‌ఎం జుబేదా, ఉపాధ్యాయులు ఆలీ హుశేన్, బీసన్న, నాగసుశీల, విద్యాకమిటీ చైర్మన్ మహ్మద్ హుశేన్ తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండంలోని పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంఈవో సుభాన్ తెలిపారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

జూపాడుబంగ్లా: పాఠశాల అభివృద్ధికి అందరం కలిసి పాటుపడుదామని యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, ఎస్ఎంసీ చైర్మన్ అహ్మద్, తాటిపాడు హెచ్‌ఎం రవిశేఖర్, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ అన్నారు. రాష్ట్రప్రభుత్వం గురువారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం పాఠశాలల్లో నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో గురువారం సంబరంగా మెగా పేరెంట్స్ మీటింగ్స్ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్డీవో నాగజ్యోతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి తులసీదేవి, తోటగేరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో బాలాజీనాయక్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, తోటగేరి స్కూల్ హెచ్‌ఎం బాలస్వామి తదితరులు ఉన్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1989-90 పదవ తరగతి పూర్వ విద్యార్థులకు రూ.1.7లక్షల విలువ చేసే ఫర్నీచర్‌ను పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఇదిలావుంటే డిపాల్ కిండర్ స్కూల్‌లో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోమిన్ షబాన, శ్రీపద్మావతి హైస్కూల్ నందు రిటైర్డు ఎంఈవో నాగేశ్వరరావు మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: వెంకటాపురంలోని జడ్పీ హైస్కూల్‌లో మెగా పీటీఎం నిర్వహించారు. సర్పంచ్ గంగాదేవి, హెచ్‌ఎం లలిత కుమారి, కోఆప్షన్ సభ్యులు రాజేంద్రారెడ్డి, రమణారెడ్డి, ఉపాధ్యాయులు గాలిబ్, వెంకటరమణ, దాసు, పుష్పలత, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



అయ్యలూరులో మాట్లాడుతున్న మౌలానా షేక్ ముస్తాక్‌అహ్మద్



మిడుతూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య



ఆత్మకూరులో బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్డీవో నాగజ్యోతి



వడ్డెమానులో మాట్లాడుతున్న మాండ్ర లింగారెడ్డి

గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు ఆపాలి

నందికొట్కూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం బొల్లవరం, బ్రాహ్మణకొట్కూరులలో ఆర్టీసీ బస్సులు ఆపాలని ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షులు సాయి కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు పట్టణంలో ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సాయికుమార్ యాదవ్ మాట్లాడుతూ మండలంలోని బొల్లవరం, బ్రాహ్మణకొట్కూరు గ్రామాల నుంచి విద్యార్థులు చదువుల నిమిత్తం కర్నూలు నగరానికి అధిక సంఖ్యలో వెళ్తున్నారన్నారు. నందికొట్కూరు, ఆత్మకూరు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను ఆయా గ్రామాల్లో ఆపకపోవడంతో విద్యార్థులు సమయానికి పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు శంకర్, ధనుంజయ, మున్నా పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నంద్యాలలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నాయకుడు ఎంఆర్.నాయక్ మాట్లాడుతూ డ్యూయల్ డిగ్రీ విధానం అమలు పరుస్తున్నామని ప్రకటించి సమీక్ష జరిపి మళ్లీ సింగిల్ మేజర్ విధానమే కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. అదే విధంగా ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించి మైనర్ సబ్జెక్టులకు క్రెడిట్ పాయింట్లు పెంచాలని డిమాండ్‌చేశారు. ఇంటర్న్‌షిప్ చేస్తున్న సందర్భంలో విద్యార్థులకు తగిన స్టైఫండ్ ఇచ్చే విధంగా సంబంధిత పరిశ్రమలతో ఒప్పందం చేసుకోవాలని కోరారు. ఇంటర్ పరీక్షల ఫలితాలు వెలువడి మూడు నెలలు గడుస్తున్నా ఇంత వరకు అడ్మిషన్‌ల ప్రక్రియ చేపట్టకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సందీప్, సాయి, విజయ్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య తీర్చాలి'



నిరసన తెలుపుతున్న క్రిష్ణరావుపేట గ్రామస్థులు

పాములపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): క్రిష్ణరావుపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించడం లేదని గుక్కెడు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు కేజీ రెడ్డుపై బైఠాయించారు. దీంతో రహదారిపై వాహన రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు మాట్లాడుతూ నేషనల్ హైవే నిర్మాణపు పనుల్లో గ్రామంలోని తాగునీటి పైపులు దెబ్బతిన్నాయన్నాయన్నారు. దీంతో గత కొంతకాలంగా గ్రామంలో నీటి సరఫరా లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్రాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

13న కంటి వైద్య శిబిరం

నంద్యాల కల్చరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న ప్రణవ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రామసుబ్బారెడ్డిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. నంద్యాల విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఈ వైద్య శిబిర ఉంటుందని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాలకు విరాళం

నందికొట్కూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని సీఎస్ఐ స్కూల్‌లో చదువుకున్న 1989 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు చిత్రాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తరగతుల మరమ్మతులు, పెయింటింగ్ నమిత్తం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని హెచ్‌ఎం సుధాకర్‌కు అందించారు. స్కూలు అభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో శామ్యూల్, శ్రీను, కలీముల్లా, అజీస్, తిక్కస్వామి పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ ఒక ప్రకటనలో సూచించారు. ఎంసీఏ, ఎమ్మెస్సీ ఇన్ కంప్యూటర్ సైన్స్, ఎంటెక్‌లో కనీసం 55శాతం మార్కులతో పీజీ చేసిన వారు అర్హులని, పీహెచ్‌డీ లేదా ఎన్ఈటీ, ఎస్ఈటీ, ఎస్ఎల్ఈటీలో అర్హత సాధించిన వారికి కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్హతలు, అనుభవం తగిన వివరాలతో కూడిన పూర్తి బయోడేటా, సర్టిఫికేట్‌ల జిరాక్స్‌లతో ఈనెల 17న కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'

కొత్తపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమ య్యాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. గురువారం కొత్తపల్లిలోని వెన్నెల గార్డెన్ ఫంక్షన్ హాలులో ఆ పార్టీ మండల కార్యదర్శి వెంకటశివుడు అధ్యక్షతన సీపీఐ మండల మహాసభ నిర్వహించారు. ఆత్మకూరు మండల కార్యదర్శి ప్రతాప్, మహిళా సమైఖ్య నాయకురాలు ముర్తుజాబీ, రాణెమ్మ, భీమలింగం, తిరుపాలు, చాంద్, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి



నంద్యాలలో పూజలు చేస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వెలసిన పలు సాయిబాబా ఆలయాలలో గురువారం గరుపౌర్ణమి, వ్యాసపూర్ణమి పురష్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని సాయిబాబా అలయాలలో అన్నప్రసాదవిత రణ గావించారు. నంద్యాల నాగులకుంట రోడ్డు, బొమ్మలసత్రం, చాబోలురోడ్డులో, జంబులా పరమేశ్వరీ ఆలయం సమీపంలోని సాయిబాబా ఆలయాల్లో బాబాకు ప్రత్యేక పూజలు, ప్రత్యేక హారతులు ఇచ్చారు. విశ్వనగర్, జంబులా పరమేశ్వరి దగ్గరలోని సాయిబాబా ఆలయాలలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, సుగాలితాండలోని శ్రీచక్రపీఠంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పాల్గొని బాబాకు పూజలు నిర్వహించారు. బొమ్మలసత్రం దగ్గరలోని సాయిబాబా ఆలయంలో హోమాలు, బాబాకుపల్లకి సేవ కార్యక్రమాలునిర్వహించారు. బైటిపేట చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఉన్న సాయిబాబా గుడి, సాంబవరం దగ్గర వున్న సాయిబాబాగుడి, కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో తదితర ఆలయాలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పాములేటిస్వామి ఆశ్రమం నందు యోగానంద ఆధ్వర్యంలో వేడుకలునిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి మహోత్సవం శోభయమానంగా సాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రథానికి పూజలు చేపట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యే బుడ్డాను ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకురాలు మోమిన్ షబాన, టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, శివప్రసాద్‌రెడ్డి, రామ్మూర్తి తదితయులు ఉన్నారు. గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం జిల్లాలో మరెక్కడ లేనివిధంగా ఆత్మకూరు పట్టణంలో జరిగిన శ్రీషిర్డీసాయినాథుని రథోత్సవ క్రతువుతో అత్యంత వైభవోపేతంగా జరిగింది.

మహానంది: మహానంది మండలం అల్లీనగరం గ్రామంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయం అర్చకులు ప్రత్యేకంగా పూలతో బాబా విగ్రహాన్ని అలంకరించారు. పూజలతో పాటు అభిషేకాలను భక్తి శ్రద్ధలతో జరిపారు. మధ్యాహ్నం అష్టవిధ మహా మంగళహారతి సేవను నిర్వహించారు. హాజరైన వందలాదిమంది భక్తులకు అల్లీనగరంకు చెందిన తోటమ్మగారి రమణ అన్నదానం జరిపారు. ఆలయ నిర్మాణదాతలు శిలివేరు వేణుగోపాల్, వాణి దంపతులతో పాటు పలువురు ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించి భక్తిశ్రద్దలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నాయకుడు బుడ్డా శేషారెడ్డి, మాజీ ఎంపీపీలు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

గడివేముల: మండలంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కరిమద్దెల, చిందుకూరు, గడివేములలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను నిర్వాహకులు అందజేశారు. సాయంత్రం సాయిబాబా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ శివార్లలోని శ్రీ షిర్డి సాయిబాబ ఆలయంలో శ్రీ నాగసాయి విద్యబ్రహ్మ ఆశ్రమం పీఠాదిపతి శ్రీ రామనందస్వామి గురు వ్యాస పౌర్ణమి ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, హారతులు నిర్వహించారు.

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో సాయిబాబ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ నిర్వాహకులు విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలకరించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు అశేష భక్తజనం మధ్య వైభవంగా జరిగాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ఆత్మకూరులో రథాన్ని లాగుతున్న ప్రముఖులు, భక్తులు




కరిమద్దెల గ్రామంలో..



నెహ్రూనగర్‌లో..



అల్లీనగరంలో..



గువ్వలకుంట్లలో..

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

జగన్ పాలనలో రాష్ట్రం సర్వ నాశనం

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సంజామల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం సర్వ నాశనమైందని రోడ్లు, భవనాల శాఖామంత్రి బీసీ జనార్ద న్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని ఆల్వకొండలో గురువారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలు ప్రజలకు అందించారు. గ్రామంలో నూత నంగా రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా ఆపార్టీ నాయకులు టీడీపీ అభివృద్ధిని ఓర్వలేక విమర్శించడం సిగ్గు చేటన్నారు. సభలో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసులుతో మాట్లాడి సీసీ రోడ్లు, డ్రైయిన్‌కు సంబంధించి రూ.14లక్షల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పంచాయితీరాజ్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా నిధులు విడుదల చేయించి రోడ్లు, అవసరమైన సౌకర్యాలు ప్రజలకు కల్పించాలని డీఈని ఆదేశిం చారు. టీడీపీ నాయకులలు మంచాల మద్దిలేటిరెడ్డి, కాట్రెడ్డి మలికా ర్జునరెడ్డి, చిన్నబాబు, భరత్‌రెడ్డి, రాజగోవిందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పెద్దసు బ్బారెడ్డి, బాషా, మూసాని చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, టీడీపీ మండల ఇంచార్జి బత్తుల ప్రతాప్‌రెడ్డి, మల్కిహుసేని, మద్దిలేటి, మాధవ, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనపై ప్రజలు సంతృప్తి

● ప్రజలతో మమేకమైన కోట్ల దంపతులు

డోన్ టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావుయాదవ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పాత పేట 7వ వార్డులోని సచివాలయం 4, 5 పరిధిల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రగతిని సంక్షేమం ఫలాలు వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. పాతపేట అమ్మవారి శాలలోని అమ్మవారికి ఎమ్మెల్యే కోట్ల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కోట్ల దంపతులను ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి కింద మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్యగౌడు, టీఈ రాఘవేంద్రగౌడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలుగా అభివృద్ధే లక్ష్యం: విజన్ స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా పేద కుటుంబాలను దత్తత తీసుకుని వాటిని బంగారు కుటుంబాలుగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ వచ్చే నెల ఆగస్టు 15నాటికి ఎంపికైన పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దే బాధ్యతను మెంటర్లు స్వీకరించేందుకు ప్రోత్స హిస్తామన్నారు. ఆర్డీవో నరసిహులు, డీఎల్‌డీవో నరసింహారెడ్డి, మున్సి పల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, డోన్, బేతంచెర్ల తహసీల్దార్లు రవికుమార్, నాగమణి, సీడీపీవో శంషాద్‌బేగం, అధికారులు, మెంటర్లు పాల్గొన్నారు.

ఇది దగా ప్రభుత్వం

మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన దగా ప్రభుత్వం అని కూటమి ప్రభుత్వంపై మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. గురువారం సాయంత్రం పట్టణ సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో వైసీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథ కాల పేరుతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభు త్వంపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు.

ప్రజలను చైతన్యవంతులను.. సూపర్ సిక్స్ పథకాలు అంటూ మోసపూరిత హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేలా ప్రజలను చైతన్యవంతులు చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. డోన్‌లో జరిగిన వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ఎంపీ పోచా బ్రహ్మానం దరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకురాలు కల్పలతారెడ్డి, డోన్ ఎంపీపీ రేగటి రాజ శేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్, శ్రీరాములు, వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై వారోత్సవాలు

బనగానపల్లె, జూలై 10(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె కోర్టులో బనగానపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ప్రతిమ ఆధ్వర్యంలో లాయర్లకు మధ్యవర్తిత్వంపై గురువారం అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వం వారోత్సవాల సందర్భంగా లాయర్లతో సమావేశమై వారికి అవగాహన కల్పించారు. న్యాయాధికారి మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. లాయర్లు మధ్యవర్తిత్వం వహించి కేసులను త్వరగాఎలా పరిష్క రించాలో ఆమె వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్య క్షుడు ఖాజాహుసేన్, శిక్షణ పొందిన న్యాయవాదులు జగన్నాథరెడ్డి, అజాంహుసేన్, ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లకు పోటీగా..

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

● అట్టహాసంగా మెగా పీటీఎం కార్యక్రమం

డోన్ టౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లకు పోటీగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తున్నామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్ర కాష్ రెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో డోన్ పట్టణం సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నెహ్రూనగర్‌లోని జడ్పీ హెచ్ఎస్ పాఠశా లలో మెగా పీటీఎంకి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేకు విద్యార్థులు, తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులతో ఘనంగా స్వాగతం పలి కారు. ఎమ్మెల్యే కోట్ల దంపతులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నతస్థాయిలో రాణించేందుకు విద్యార్థి దశనుంచే కృషిచే యాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో నరసింహారెడ్డి, ఎంఈవో ప్రభాకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివా సులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి కొత్త ఒరవడిని సృష్టించి విద్యకు పెద్దపీట వేశారని రాష్ట్ర సీడ్స్ డెవల ప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం డోన్‌లోని పాతపేట జడ్పీహెచ్ పాఠశాలలో ధర్మవరం సుబ్బారెడ్డి, బాలికల పాఠశాలలో జరిగే మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరయ్యారు. గత సంవత్సరం పదో తర గతి ఫలితాల్లో పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధిం చిన విద్యార్థులు మొదటి, రెండో, మూడో బహుమతులు రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు నగదును అందించారు. ఆర్డీవో నరసింహులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి..

విద్యార్థులు సెల్‌పోన్లకు దూరంగా ఉండాలని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, ఐకేపీ మల్లికా ర్జున, ప్రభుత్వ వైద్యురాలు ప్రదీప్తి అన్నారు. గురువారం గుత్తిరోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు పెట్టి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాగ్యశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోనే నిజమైన గౌరవం: ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ: చదువుతోనే సమాజంలో నిజమైన గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం ఆళ్లగడ్డ పట్టణం లోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పడకండ్ల అంబే డ్కర్ గురుకుల పాఠశాలలో చదువుల పండగ(మెగా పీటీఎం) కార్యక్ర మం నిర్వహించారు. కమిషనర్ కిషోర్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంఈవో శోభావివేకవతి, కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశ్వరరెడ్డి, సీఐ యు గంధర్, హెచ్‌ఎం వీరరాఘవయ్య, కౌన్సిలర్ హుస్సేన్‌బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఉపాధ్యాయులు, తల్లిదం డ్రులపైనే ఆధారపడి ఉందని బేతంచెర్ల తహసీల్దార్ నాగమణి, టీడీపీ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో జరిగిన పీటీ ఎం కార్యక్రమానికి ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ హాజరై మాట్లాడారు. గోర్లగుట్ట పాఠశాలలో హెచ్‌ఎం మద్దిలేటిరెడ్డి అధ్యక్షత వహించగా. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. గోరుమా నుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్యాపిలి: విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీలో నిర్వహిం చిన పీటీఎంకు ఆయన హాజరయ్యారు. మెగా టీచర్స్, పేరెంట్స్ సమా వేశానికి ఆయన హాజరయ్యారు. ఎంఈవో వెంకటేశ్వరనాయక్, కేజీబీవీ స్థల దాత డాక్టర్ దేవీదాయానందసింగ్, టి శ్రీనివాసులు, రామ్మోహన్ యాదవ్, నాగేంద్ర, సందీప్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బనగానపల్లె: విద్యా శాఖామంత్రి నారాలోకేశ్ చొరవతో రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, క్రమశిక్షణతో విద్యార్థులు విద్యను అభ్యసించాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు కళాశాలల్లో మెగా మెగా పేరెంట్ కమిటీ ఉత్సవాలు గురువా రం ఘనంగా నిర్వహించారు. బనగానపల్లె మండలంలోని అన్ని ప్రభు



ప్యాపిలి: మాట్లాడుతున్న నాగేశ్వరరావుయాదవ్

త్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత , ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఈమెగా పేరెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. బనగానపల్లె పట్టణంలోని కస్తూర్బా స్కూల్‌లో ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్య అతిథిగా బీసీ రాజారెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యా యుల విజ్ఞప్తి మేరకు వారం రోజుల్లో కేజీబీవీలో మినరల్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, సర్వశిక్షా అభియాన్ ఏఎస్‌వో దస్తగిరిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదం డ్రులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

● ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని నియోజకవర్గం స్పెషల్ అధికారి రాంభూపా ల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో పేరెంట్ కమిటీ సమావేశానికి ముఖ్య అధిదిగా హాజరయ్యారు. తహసీల్దారు నారాయణరెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆనంద్, లాయర్ మాధవరెడ్డి, జగన్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● బనగానపల్లె పట్టణంలోని కస్బాపాఠశాలలో బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు వంద మంది విద్యార్థులకు నోటు పుస్త కాలు, ఇతర సామాగ్రి పంపిణీ చేశారు. హెచ్‌ఎం సుంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని బీసీ ఇంది రమ్మ తెలిపారు. ఉపాధ్యాయుడు సత్యప్రకాశ్, అబ్దుల్ కలీం, విజయ, ముంతాజ్‌బేగం, స్కూల్ కమిటీ చైర్మన్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో స్పెషల్ అధికారి రఘురాం, హెచ్‌ఎం ప్రసాదరావు, ఉర్దూపాఠశాలలో హెచ్‌ఎంతో పాటు టీడీపీ నాయకులు కాశీంబాషా, అహ్మద్‌హుసేన్, నియాజ్‌హుసేన్, షఫీ, షబ్బీర్, గౌండాబాబు పాల్గొన్నారు.

అవుకు: పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్ - టీచర్స్ (పీటీఎం) కార్యక్రమం హర్షనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు ఏపీ మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన పీటీఎం సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీటీఎం సమావేశాల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు పాల్గొని తమ అభిప్రాయాలు సూచనలు వేదికపై పంచుకోవటం విద్యార్థుల్లో ఉత్తేజాన్ని కలిగిస్తోందన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహించారు. ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాలలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా ఉన్నత పాఠశాలలో తహసీల్దారు సువర్ణదేవి తల్లులకు మొక్కలు, గ్రీన్‌కార్డులు అందించారు. మాయ లూరు ఉన్నతపాఠశాలలో ఆటల పోటీల్లో గెలుపొందిన తల్లిదండ్రులకు హెచ్‌ఎం షరీఫ్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. హరి వరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు నృత్యం చేశారు. కార్యక్రమాల్లో ఎంఈవో రఘురామిరెడ్డి, ఎంపీడీవో ఉమామ హేశ్వర్‌రావు, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, టీడీపీ మండల కన్వీనరు బోరెడ్డిశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ పుణ్యమ్మ పాల్గొన్నారు.

● చదువును డబ్బుతో కొనలేరని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. చదువు అనేది సంపద లాంటిదన్నారు.

శిరివెళ్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లి దండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని(మెగా పీటీఎం 2.0) ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యా వికాసానికి ఉపాధ్యాయులు అవలం భిస్తున్న విధానాలు, మెరుగైన ఫలితాల కోసం ఆచరిస్తున్న ప్రణాళికలపై సమావేశాల్లో చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పలువురు తల్లిండండ్రులు సలహాలు, సూచనలు అందజేశారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన మెగా పేరేంట్స్, టీచర్స్ సమావేశంలో సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తిమ్మనాయినిపేట హైస్కూల్లో హెచ్‌ఎం శ్రీవాణి అధ్యక్షతన, కొలిమిగుండ్ల జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్, పెట్నీ కోట హైస్కూల్, కొలిమిగుండ్ల ప్రాథమిక మెయిన్‌స్కూల్, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, కల్వటాల తదితర అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశా లల్లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సాంస్కృ తిక కార్యక్రమాలతో వేడుకలు చేపట్టడం అందరినీ అలరించింది.

రుద్రవరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిటిలు కృషి చేయాలని మండల టీడీపీ కన్వీనరు రంగనాయకులు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, టీడీపీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎంఈవో-2 లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని రుద్రవరం ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలతో పాటు ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో తల్లిదం డ్రులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, నాగేశ్వరరావు, వెంకటరమణ, గ్రామాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంజామల: ప్రతి విద్యార్థి సత్ప్రవర్తన కలిగి ఉండాలని సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాలెహ కోరారు. గురువారం సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్ కమిటీ సమా వేశం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జిలాని భాష, అమర్‌నాథరెడ్డి , కిరణ్, మాచెర్ల గౌడ్, ప్రభుకుమారి, చెన్నమ్మ, నాగమ్మ, నాగరాజమ్మ, ప్రత్యేక అధికారి మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో సాల్మన్, తహసీల్దారు అనిల్‌కుమార్, కస్తూర్బా ప్రిన్సిపాల్ శ్రీలేఖ, పేరుసోముల



డోన్: ఏపీ మోడల్ పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



ఆళ్లగడ్డ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



బనగానపల్లె: మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



డోన్: పాతపేట జడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, ధర్మవరం సుబ్బారెడ్డి



చాగలమర్రి బాలికల పాఠశాలలో తాడు లాగుతున్న అధికారులు, విద్యార్థులు

హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, నరసింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం పేరెంట్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఎంఈవో మనోహ ర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ సావిత్రి, జిల్లాపరిషత్ పాఠశాల చైర్మన్ నగిరి సుధాకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చెన్నకేశ్వరి, పీఈటీ దేవేంద్ర, ఉపాధ్యాయులు, నంద్యాల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సిద్ధి సత్యం, సురేంద్ర, సాగునీటి సంఘం అధ్యక్షుడు రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి నప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని టీడీపీ కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. హెచ్‌ఎం రాజయ్య ఆధ్వర్యంలో మెగా పీటీఎం నిర్వహించారు. కోవెలకుంట్ల మండల మాజీ అధ్యక్షుడు బీవీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్‌డే వేడుకలు నిర్వహించారు. చాగలమర్రి బాలుర పాఠశాలలో ప్రత్యేక అధికారి జగ్గయ్య, బాలికల పాఠశాలలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, ఎంఈవో అనూరాధ, హెచ్‌ఎం శివలక్ష్మి, కస్తూర్బా పాఠశాలలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎస్‌వో స్వప్న, చింతలచెరువు పాఠశాలలో ఎంఈవో న్యామతుల్ల, చిన్నవంగలి పాఠశాలలో టీడీపీ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి, హెచ్‌ఎం సుధాక ర్‌గుప్తా, ముత్యాలపాడు బర్ష్ ఉన్నత పాఠశాలలో డైరెక్టర్ పాల్‌రా జారావు, హెచ్‌ఎం సింధూర వేడుకలను ప్రారంభించారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

అవుకు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబా బునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి పట్టణంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందిం చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని కోట కందుకూరు గ్రామంలో గురువారం సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లగట్ల రాంమో హన్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఆర్ల శ్రీనివాసులు, ఆర్ల పెద్ద సుబ్బయ్య, హుస్సేన్‌వలి, బీబీ, మదార్‌బాషా, ఉమ్మర్‌వలి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఉయ్యాలవాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక అదృశ్యం అయినట్లు ఏఎస్‌ఐ సుదర్శనరెడ్డి గురువారం తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఇంటి నుండి వెళ్లి పోయినట్లు బాలిక తండ్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నర్సరీ పనులు వేగవంతం చేయాలి

రుద్రవరం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఫారెస్టు నర్సరీలో ఉన్న పనులను వేగవంతం చేయాలని సబ్ డీఎఫ్‌వో శ్రీని వాసరెడ్డి సూచించారు. గురువారం నర్సరీ పనులను తనిఖీ చేశారు.

ఘనంగా గురుపౌర్ణమి

అవుకు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాపురం గ్రామంలో వెలసిన షిరిడీ సాయిబాబ ఆలయం లో గురుపౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా గురువారం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీ రరెడ్డి, ఎస్ రామకృష్ణారెడ్డి, ఐ.ఉగ్రసే నారెడ్డితో కలసి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొని సా యినాథుడికి పూజలు నిర్వహించారు. కోలాటంలో పాల్గొన్న చిన్నారులను మంత్రి బీసీ అభినందించారు.



రామాపురంలో సాయిబాబా గ్రామోత్సవంలో పాల్గొన్న మంత్రి బీసీ

శిరివెళ్ల: మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల, వీరారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామాల్లో సాయినాథుని పల్లకి ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం వేద పండితుడు పెద్దశాస్త్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయి భక్తులు భిక్షాటన చేసి అనంతరం సాయి పాదుకలు, చిత్రపటాలచే వీధుల గుండా గ్రామోత్సవం చేశారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం కోవెల కుంట్ల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్‌రెడ్డితో పాటు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

రుద్రవరం: చందలూరు, రుద్రవరం, మంద లూరు గ్రామాలోల్ల గురు పౌర్ణమి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. అర్చకులు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, నవగ్రహ పూజ నిర్వహించారు. వెంకటేశ్వర్లు, నరసింహులు, వీరయ్య, భగవాన్ పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో గురు పౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిం చారు. పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిం చారు. దొర్నిపాడు ఆలయంలో వెలసిన సాయి బాబా ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బాబాకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.

బేతంచెర్ల: పట్టణ శివారులో కర్నూలు రహదారిలో వెలసిన షిరిడీ సాయిబాబా మంది రంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

ప్యాపిలి: స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు.

కొలిమిగుండ్ల: మండలంలో గురుపౌర్ణిమ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. కొలిమిగుండ్ల సాయిమందిరంలో వీడీ రాజగోపాల్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రదర్శించిన సాంఘిక నాటక ప్రదర్శన, భజనలు, పాడుతా తీయగా, పౌరాణిక నాటకాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎర్రగుడి సాయిమందిరంలో పెద్ద ఎత్తున పూజలు, అన్నదానం నిర్వహించారు.

కేసీ కెనాల్ చివరి ఆయకట్టుకు సాగునీరు: ఎమ్మెల్యే

శిరివెళ్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కేసీకెనాల్ చివరి ఆయక ట్టుకు సైతం సాగునీరు అంది స్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సుపరిపా లనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీరారెడ్డిపల్లె గ్రామంలో గురువారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీ నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీ నర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాయ కులు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, కల్లూరి శకుంతలమ్మ, యామా గుర్ర ప్ప, సూరారామ, బాలచం ద్రుడు, బీసీ ఫిదాహుసేన్, ఉల్లి వెంకట సుబ్బయ్య, వివిధ శాఖల అధికా రులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోవెలకుంట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. కోవెల కుంట్ల పట్టణంలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో పట్ట ణంలోని చాకలి వీధిలో దాడి చేయ గా పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8వేలు నగదు , పేక ముక్కలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొలిమిగుండ్ల రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి: ఎంపీ

కొలిమిగుండ్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని, తాడిపత్రి-కోవెలకుంట్ల అనుసంధానంగా రైల్వే లైన్ లింక్ కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. పేర్కొన్నారు. గురువారం స్థానిక సాయిబాబా ఆలయంలో జరిగిన గురుపౌర్ణిమ వేడుకల్లో అనంతపురం ఎంపీతో పాటు రిటైర్డ్ మైనింగ్ డైరెక్టర్ వీడీ రాజగోపాల్ సోదరులు, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, వీఆర్ వెంకటేశ్వరరెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, బయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొదటిసారి కొలిమిగుండ్లకు వచ్చిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను వీడీ రాజగోపాల్‌తో పాటు పలువురు వాల్మీకి సంఘం నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలని కోరగా, రూ.25లక్షలు కేటాయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతపురం - అమరావతి రహదారి సైతం త్వరలోనే పూర్తయ్యే అవకాశం ఉందని ఎంపీ తెలిపారు.